క్లుప్తంగా

అండర్‌పాస్ రోడ్డులో మట్టి తొలగింపు



మట్టిని తొలగిస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తూరు: పట్టణంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన అండర్‌పాస్ రోడ్డులో మట్టి పేరుకుపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఈ నెల 9న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అండర్‌పాస్ ఫెయిల్' కథనానికి సంబంధితశాఖ అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా బుధవారం అండర్‌పాస్ రోడ్డులో పేరుకున్న మట్టిని, రోడ్డు పక్కన కుప్పలుగా ఉన్న మట్టిని తొలగించారు. దీంతో స్థానికులు, వాహనదారులు సాక్షికి అభినందనలు తెలిపారు.

నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని దూసకల్ గ్రామానికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు దార నర్సింహా సోదరుడు దార జంగయ్య బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ గ్రామానికి వెళ్లి మృతుడు దార జంగయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు విఠ్యాల నర్సింహా, సంగెం శ్రీకాంత్, మల్లేశ్, పవన్ పాల్గొన్నారు.

పండగలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

కొత్తూరు: కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ తమ పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జేపీ దర్గాను బుధవారం ఆయన సందర్శించి బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో పీర్ల పండగను కులమతాలకతీతంగా నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పండగల నిర్వహణకు సమప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. పండగలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహా, శివశంకర్‌గౌడ్, రవికుమార్‌గుప్తా, దేవేందర్‌ముదిరాజ్, కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



గోమాతకు భక్ష్యాలను సమర్పిస్తున్న విశ్వకర్మ గౌరవాధ్యక్షుడు నర్సింహాచారి

మొయినాబాద్‌రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వర స్వామి ఆలయం, హిమాయత్‌నగర్ స్వామి నారాయణ గురుకుల్ లోటస్ టెంపుల్, కనకమామిడి సంగమేశ్వర దేవాలయం, అమ్డాపూర్ రక్తమైసమ్మ దేవాలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో దేవాలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. అదే విధంగా ఆయా గ్రామాల్లో రైతులు గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్ష్యాలను ప్రసాదంగా అందించారు.

నేడు రైతు వేదికలో రుణమాఫీ ప్రదర్శన

కొత్తూరు: పట్టణంలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న రైతు వేదికలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న రుణమాఫీ వేడుకలను ప్రదర్శించనున్నట్లు ఏఓ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో లక్ష లోపు రుణాలను మాఫీచేసే కార్యక్రమాన్ని రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో గూడూరు, మల్లాపూర్, కొత్తూరు, తీగాపూర్, పెంజర్ల, కొడిచర్ల, ఇన్ముల్‌నర్వ, సిద్దాపూర్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొనాలని కోరారు.

చినుకు పడితే చీకటే

- నర్సప్పగూడలో వర్షం కురిస్తే కరెంట్ కట్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



చీకట్లో నర్సప్పగూడ

నందిగామ: కరెంట్‌ను ఏ మాత్రం కట్ చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఓ వైపు స్వయానా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిస్తున్నా ఇక్కడి అధికారులు మాత్రం ఆ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. వర్షాలు కురిస్తే చాలు ఆ గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. సాయంత్రం వేళ ఏ మాత్రం వర్షం కురిసిందా.. అయితే ఆ రాత్రి చీకటి రాత్రులుగా గడపాల్సిందే. అంతేకాకుండా ఒక వైపు ఉక్కబోత, మరోవైపు దోమల మోతతో ఆ గ్రామస్తులు అల్లాడిపోతున్నా కూడా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇదీ మండల కేంద్రమైన నందిగామకు అతి సమీపంలో ఉన్న నర్సప్పగూడ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్య.

కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి

మండల పరిధిలోని నర్సప్పగూడలో గత కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యతో గ్రామస్తులు సతమతమవుతున్నా కూడా సంబంధితశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా కూడా ఎక్కడో అడవి ప్రాంతంలో ఉన్నట్లుగా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం సాయంత్రం వేళ గ్రామంలో ఏ మాత్రం చిన్నపాటి వర్షం కురిసిందంటే చాలు కరెంట్ కట్ చేస్తారు. వర్షం తగ్గిపోయినా సరే విద్యుత్‌ను సరఫరా చేయరు. సంబంధిత అధికారులకు ఫోన్‌చేస్తే సక్రమంగా స్పందించరని గ్రామస్తులు మండిపడుతున్నారు.

ఎంతకాలం ఇలా..

గ్రామంలో గత కొన్నేళ్లుగా ఇదే సమస్య తలెత్తుతోందని, విద్యుత్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ఒక వేళ తప్పని పరిస్థితిలో అధికారులు, లైన్‌మెన్ వచ్చినా కూడా తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, ఈదురు గాలులు వీచినా విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నారని, రాత్రిపూట కేవలం 15 నిమిషాలు వర్షం కురిసినా కూడా తెల్లవారే వరకు విద్యుత్‌ను నిలిపివేస్తుండటంతో రాత్రివేళ నిద్రపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్య గురించి అధికారులకు ఫోన్‌లు చేసినా కూడా స్పందించకపోవడం దారుణమని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి నర్సప్పగూడలో నెలకొన్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా..

తాజాగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిసిన సమయంలో తీవ్రమైన గాలులు వీస్తే కరెంట్ కట్ చేసినా పర్వాలేదు. కానీ ఏ మాత్రం వర్షం కురిసినా కూడా విద్యుత్‌ను నిలిపివేసి మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



రాత్రిళ్ల పూట ఏ మాత్రం చిన్నపాటి వర్షం కురిసిందంటే చాలు తెల్లవారువరకు విద్యుత్ ఉండదు. దీంతో తెల్లవార్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. దోమల బాధకు తట్టుకోలేకపోతున్నాం. అధికారులకు ఫోన్‌చేస్తే స్పందించడం లేదు. ఉన్నతాధికారులు మా గ్రామస్తులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యపై దృష్టి సారించాలి.

–కొండన్నగూడ సత్యం, మాజీ వార్డుసభ్యుడు

పట్టించుకోవడం లేదు..



గ్రామంలో గత కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామంలో విద్యుత్ సమస్యను గుర్తించి, శాశ్వత పరిష్కారం ఎందుకు చేయడంలేదో అర్థం కావడం లేదు. విద్యుత్ బిల్లుల వసూళ్ల మీద పెట్టిన దృష్టి సమస్యలపై పెడితే బాగుంటుంది.

–కొంగర భూపాల్, గ్రామస్తుడు

ఆరోపణల్లో వాస్తవం లేదు



నర్సప్పగూడలో వర్షం కురిస్తే కరెంట్ కట్ చేస్తున్నామని, రాత్రిళ్లు మళ్లీ కరెంట్ సరాఫరా చేయడం లేదనే ఆరోపణలలో వాస్తవం లేదు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు. సక్రమంగానే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. కేవలం వర్షం వచ్చినప్పుడు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నాం. వర్షం తగ్గిన తర్వాత విద్యుత్ యథావిధిగా సరఫరా చేస్తున్నాం.

–శ్రీధర్, విద్యుత్‌శాఖ ఏఈ, నందిగామ

పోరాటయోధుడు పండగ సాయన్న



పండగ సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చేవెళ్ల: దామరగిద్ద బస్‌స్టేజీ వద్ద..

షాద్‌నగర్: ప్రజా పోరాట యోధుడు పండగ సాయన్న జయంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న పండగ సాయన్న విగ్రహానికి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నిజాం నవాబుల నిరంకుశ పాలనకు ఎదురునిలిచి పోరాటం చేశాడని, ఆయన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. నిరుపేదలకు అండగా నిలిచి వారికి భూమి, భుక్తి, విముక్తి కోసం పండగ సాయన్న ఎంతో పోరాటం చేసి అమరుడయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ జనార్దన్, కన్వీనర్ నక్క బాల్‌రాజు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామారావు, రవీంద్రనాథ్, నర్సింలు, అర్జున్‌కుమార్, నర్సింలు, అనంత్ పాల్గొన్నారు.

చేవెళ్ల: పండగ సాయన్న పోరాటాలు మరువలేనివని చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలో, దామరగిద్ద బస్‌స్టేజీ వద్ద ఉన్న పండగ సాయన్న విగ్రహాలకు బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాములు, రామ్‌ప్రసాద్ ఉన్నారు.

ఆర్‌ఎంపీలకు గుర్తింపునివ్వడంపై హర్షం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సంఘం సభ్యులు

చేవెళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే ఆర్‌ఎంపీ వైద్యులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి గుర్తింపుకార్డులు జారీ చేస్తామని చెప్పటం హర్షణీయమని గ్రామీణ వైద్యుల సంఘం చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శులు మహిపాల్, వీరానందాచారిలు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం గ్రామీణ వైద్యుల(ఆర్‌ఎంపీ)సంఘం చేవెళ్ల డివిజన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు ముందుగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉండే ప్రజలకు ఆర్‌ఎంపీలు అందిస్తున్న వైద్యసేవలను గుర్తించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ ఇచ్చి గుర్తింపుకార్డులు ఇవ్వటంతో ఆర్‌ఎంపీలకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డివిజన్ ఉపాధ్యాక్షుడు జగన్, కోశాధికారి ప్రభాకర్, సభ్యులు సుభాస్‌గౌడ్, కృష్ణారావు, చారి, చంద్రశేఖర్‌గౌడ్, శశికల, శ్రవణ్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మొక్కలు నాటి నీరుపోస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు తన మాతృమూర్తి పేరు మీద మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని శ్రీ సాయిబాలాజీ వెంచర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, విజయ్‌భాస్కర్, శ్రీనివాస్, ప్రదీప్, మోహన్‌సింగ్, సుధాకర్, లష్కర్‌నాయక్, మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ప్రశాంత్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణ, నర్సింహా, విజయ్‌భాస్కర్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సైగా విజయ్



ఎస్సైగా బాధ్యతలు తీసుకుంటున్న విజయ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సైగా విజయ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సైగా పనిచేస్తున్న సక్రమ్ రాచకొండ పోలీసుస్టేషన్‌కు బదిలీ కాగా, రాచకొండ నుంచి విజయ్ జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సైగా ఇక్కడికి వచ్చారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు సక్రమ్‌కు వీడ్కోలు పలకడంతో పాటు, విజయ్‌కు స్వాగతం పలికి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు రాజు, కృష్ణారెడ్డి, అంజనేయులు, ఎజాజ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన

కేశంపేట: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు నిర్వహిస్తున్న నిరసనలు బుధవారానికి మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చి విస్మరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అదే విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బిల్లులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాములు, సత్తమ్మ, యాదమ్మ, సబిత, జంగమ్మ, నిర్మల, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమపాలన కొనసాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలో దామోదర్ సంజీవయ్య సంక్షేమ భవన్‌లో బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలంగాణ ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ నేటి నుంచి ప్రారంభిస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, సుభాష్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, జానీ మహ్మద్, కిషోర్‌నాయక్ ఉన్నారు.

అంగన్‌వాడీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



ఆట పరికరాలను ప్రారంభిస్తున్న సత్యనారాయణరెడ్డి, నాయకులు

రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: గ్రామాల్లో చిన్నపిల్లల కోసం కొనసాగుతున్న అంగన్‌వాడీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి తన సొంత నిధులు 1 లక్ష 20 వేల రూపాయలు పెట్టి పిల్లలు ఆడుకునేందుకు కావాల్సిన ఆట పరికరాలను గ్రౌండ్‌లో ఏర్పాటు చేసి బుధవారం వీటిని స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో ఉండే చిన్నారులకు పాఠశాలలను అలవాటు చేసేందుకు వారికి ప్రీస్కూల్ కాన్సెప్ట్‌ను ప్రభుత్వం తీసుకొస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ ప్రీస్కూల్స్‌లో పిల్లలను ఉత్సాహపరిచేందుకు వారికి ఇష్టమైన ఆటలను ఆడుకునేందుకు వీలుగా గ్రౌండ్‌లో ఆట వస్తువులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. అందుకే తనవంతు సహాయంగా తన స్వగ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల కోసం జారుడు బండ, రకరకాల ఊయలలు అంగ్‌వాడీ కేంద్రం ముందు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేసే ఏర్పాట్లకు స్థానిక ప్రజలు వారి వంతు సహకారం కూడా అందిస్తే అంగన్‌వాడీలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. దీనికి అందరూ ముందుకురావాలని కోరారు. ఈ సందర్భంగా దేవునిఎర్వల్లి గ్రామంలో స్థానిక ప్రజల ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి, బక్కయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, నాయకులు జంగయ్య, రవి, వెంకటయ్య, శ్రీనివాస్, మల్లేశ్, అంగన్‌వాడీ టీచర్, ఆయా, పిల్లలు పాల్గొన్నారు.



షాబాద్: బోడంపహాడ్‌లో పీరీల ఊరేగింపులో కాంగ్రెస్ నాయకులు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో పీరీలకు ఊదు, బెల్లం దట్టీలు సమర్పిస్తున్న మహిళలు



చేవెళ్ల: ముడిమ్యాలలో పీరీల ఊరేగింపులో గ్రామ నాయకులు

ఘనంగా మొహర్రం వేడుకలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో బుధవారం మత సామరస్యానికి ప్రతీకైన మొహర్రం వేడుకలను హిందూ, ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పీరీలను ముస్లింలు డప్పుల మోతల మధ్య గ్రామాల్లోని వీధుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఊరేగించారు. అందరూ కలిసి అలయ్‌దులా ఆటలు ఆడారు. ఈ సందర్భంగా భక్తులు పీరీలకు దట్టీలు, ఊదు, బెల్లం, కొబ్బరి దండాలు, పూలు సమర్పించి ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల్లో పీరీల ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు. ప్రజలందరినీ ఆయురారోగ్యాలతో చూడాలని అల్లాను ప్రార్థించారు.



మొయినాబాద్: సురంగల్‌లో పీరీల ఊరేగింపు



మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లిలో..



కొందుర్గులో పీరీలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



చేవెళ్ల: ఆలూరులో..

కార్మికులతో వెట్టిచాకిరీ చేయించడం సరికాదు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న దేవేందర్

చేవెళ్ల: వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకోవటం చట్ట విరుద్ధమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని పలు కంపెనీలు, విల్లాస్, వెంచర్‌లలో పనిచేస్తున్న వలస కార్మికుల సమస్యలు తెలుసుకుంటూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వలస కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వలస కార్మికులతో తక్కువ వేతనాలు ఇస్తూ 10 నుంచి 12 గంటల పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. అనేక కంపెనీలలో చట్టవిరుద్ధంగా కార్మికులకు కనీస సౌకర్యాలు ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యాలను కూడా కల్పించటం లేదన్నారు. అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం 1979 ప్రకారం ఇతర రాష్ట్రాల కార్మికులతో పనిచేయిస్తే వారి సంరక్షణ పూర్తి బాధ్యత ఆ యాజమాన్యాలే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ యజమానులు చట్టవిరుద్ధంగా పనులు చేయించుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. దీనిపై కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.